# వివాహసంస్థలోని విలాపం

(కథానిక)

సీత సహజంగానే సౌందర్యవతి. తీర్చిదిద్దినట్లుండే ఆమె కన్నులు కావ్యలోకాలని సృష్టించగలవని మా స్నేహితుల విశ్వాసం. విశాలమైన ఫాలభాగంలోకి వంగి ఊగిసలాడే ముంగురులు చూపరుల కేదో దివ్యసందేశాన్ని ఇస్తున్నట్లు ఆమె జీవితము తెలిసినకొద్దీ అనుకొనేవాణ్ణి. పొడుగూ పొట్టీకాని ఆమె శరీరము లావు సన్నము కాకుండా ఉండి సాదా ఖద్దరు చీరలోనే గులాబి పువ్వులాగ మిలమిల మెరయడం ప్రతీ దృష్టికీ అందిన సంగతే. గడ్డముమీద కుడి వైపుగావున్న పుట్టుమచ్చ లేకపోతే ఆమె సౌందర్యోపాసకుల లెక్కలోకి రాకపోయే దేమో. ఎప్పుడూ మౌనంలోవుండే ఆ మూర్తిని మరుద్దామన్నా మరపురాదు.

ఆ గల్లీలో సీత సంపాదించినంత మంచి పేరు నేను కథల్లోకూడా వినలేదు ఆ నూతిదగ్గర ఆమె కనబడకపోతే పగలే చీకటి కమ్మినట్టుంటుంది. ఆ వాకిలిలో ఆమె మసలకపోతే ఆ గ్రామమే పాడడిందనిపిస్తుంది. ఆమె చూపులే అక్కడి స్త్రీజనానికి అరుణోదయం. ఆమెసాన్నిధ్యమే అక్కడి యువతీ లోకానికి పూర్ణతేజస్సు.

నాతోవన నేను వెడుతూ స్త్రీలంటే చాల అభిమాన గౌరవాలున్న నేను కూడా ఆ గుమ్మం వైపు చూడకుండా వెళ్ళలేక పోయేవాణ్ణి. ఎట్టి దురభిప్రాయమూ లేకపోయినా సీత విషయమైన విషయసేకరణకే నా మనస్సు పరువెత్తేది. ఆమె వార్తలకే చెవులు తొందరపడేవి.

ఎందుచేతనో చెప్పలేను. సీత భర్త రాజాను చూస్తే శరీరం మండినట్లయేది. తగిన బలము అందముకలవాడైనా నాకేదో వెగటుగా తోచేది. అతని కన్నులలో ఏదో దుర్మార్గము దాగుకొని ఉన్నదని అంతరాత్మ ప్రబోధించేది. సీతయందు నాకుగల స్నేహభావంచేత నామనస్సు ఇట్టి బలహీనమైన ఆలోచన నిస్తోందేమో అని తర్కించుకున్న రోజులూ లేకపోలేదు.

రాజాతో నాకు పరిచయంలేదు. అతనికి పది పుట్ల మాన్యమున్నదని, ఇక సోదరులేరని, తల్లిదండ్రులు గతించి యేండ్లుగడిచాయని, చదివింది చాలతక్కువఅని అన్న విషయాలు దర్యాప్తు మీద తేల్చుకున్నాను. చాలా తక్కువ చదివేడంటే ఏ ఆరవతరగతో అని నిశ్చయించుకున్నా. అంతకన్న చదివిఉంటాడంటే నా అంతరాత్మ ఎందుకనో అంగీకరించక మొండిపట్టు పట్టింది. అతనిలో విశిష్టత నాకేమీ కనబడలేదు. కాని సిగరెట్లతోమాత్రం వింతగా పొగవదలగలడు. ఈ మాత్రపువిద్యకే మురిసిపోయి సీత వీడిని పెండ్లాడిందికాబోలని నా హృదయం భగ్గున మండేది. పదిమంది పురుషులలో పలుకురాని వీనికెందుకో ఆ అందకత్తె నాకర్థమయేదికాదు. రాజా ఉదయం సాయంకాలం దూరంగాగూడేలవైపు షికారుకో మరెందుకో నిత్యం వెడుతూండడం చూసేవాణ్ణి. ఇదే సమయమని వారింటికివెళ్ళి సీత క్షేమ ప్రకృతిని సొంతం కనుక్కోవాలని చాలాఆశించేవాడిని. ఆమెకు నా అన్నదిక్కెవరూలేరని, పుట్టిల్లనేది ఆమెనోచుకోలేదని ఈ సోమరిపోతుకు సేవచేయడంతో ఆమె విసివిపోతోందని, నాలో నేనే ఊహించుకొని ఎన్నికాలాలోజాలిపడ్డాను. నిజానికామెకెవరైన ఆప్తులున్నారోలేదో నేటికీ నాకు తెలియనిసమస్యే. ఒకటిరెండుసార్లు ఆమెకు సానుభూతిచూపాలని వారింటివైపు వెళ్ళి తలుపు వేసి ఉండడం గమనించి, పురోగమనానికి సాహసంచాలక బదులుగా వెనక్కిరాక తప్పేదికాదు. ఒకపర్యాయం ఆమె నూతిదగ్గిర ఒంటరిగా నీళ్లు చేదుతున్నది. ఇదే నా సందేహాలన్నీ తీర్చుకొనే సమయమని గబగబసమీపించాను. ఇంతలో ఏదో పడిపోయినట్టు పొరుగింటి ముసలమ్మ అక్కడికి అవతరించింది. పట్టరాని ఆవేశంవచ్చి, కాళ్ళుకడుక్కోటంనటించి, వారచూపులలో ఆ ముసలమ్మను చురుక్కునపొడుస్తూ దూరంవచ్చేశాను. ఇంత ఆదర్శంతో వెళ్ళిన నన్ను సీత కన్నెత్తే

కొండూరి నరసింహం

చూడలేదని నాకభిమానం విసురుకు వచ్చింది. కొందరు స్త్రీలు సదభిప్రాయంతో చుట్టూ ముసరే పురుషదృష్టుల్ని గౌరవించకపోవడం కాలక్రమేణ అవమానంగానే పరిగణిస్తూవచ్చాను. ఆమె తనభర్తతో ఎన్ని యాతనలుపడుతున్నదో తెలిసికొనడానికిగదా వెళ్లాను. అంత ఇంగితం లేకుండా ఆమె ప్రవర్తిస్తే ఈ సచ్చరిత్రుడు తన సమీపాన్ని ఎందుకు అర్థించాడో గుర్తించక నటిస్తే నాకేమిటినష్టం?

ఈమధ్యనే అవతలి వీధిలోని నాగయ్య పెండ్లాము సిద్దమ్మ ముసలి భర్తచే సరిగా చూడబడక బాధపడుతోందని తెలిసి మా విస్సిగాడు ఉభయులకు రాజీ చేసి చక్కావచ్చాడు. ఇక వాడునాతో పుంతలో మామిడిచెట్టుక్రింద ఎన్ని కోశాడో... నాగయ్య సహజంగా ముసలివాడే కాకుండా అమాయకుడట. భార్య అతిటుక్కులాడి కావటంచేత దగ్గరి సంఘమంతా ఆమెకు దుర్బోధ చేశారట. ఆమెతో ఒకగంట మాట్లాడి భర్తనాగయ్యతో కలిపి ముసలివాడిని ఏదోరీతి చూడవలసిన బాధ్యత నీదేనని సిద్దమ్మకు నచ్చచెప్పి వచ్చాడట-వాని వర్ణన వింటూంటే భార్యభర్తలకు సహజంగా ఏవోకేచీ పూచీలుంటాయని మధ్యలో మనబోటి విద్యావంతులు సరిదిద్దుతూ ఉండాలికాబోలని మరీస్థిరనిర్ణయానికి వచ్చేశాను. ఈవేళ సీతను బలవంతంగానైనా నిలవైచి ఆమె కష్టసుఖాలన్నీ ఆమెనోటివెంట వినవలసినరోజు...

సంజె చీకటిలో ముంగిలి వాకిలిలో అడుగు పెట్టాను. ముందుకు వెళ్ళిసందుతలుపు తడికగెంటుకొని పెరటివైపుకు నడుస్తున్నాను. అంటే ఆమె దొడ్లో ఏ పనులలోనో ఉంటుందని, పలకరించవచ్చని. నా అభిప్రాయంలో రాజా దూరపుగూడేలవైపుగా వెళ్ళివుంటాడని.

నా ప్రక్కనుంచీ యేదో పరిగెత్తినట్టు తాటాకుదడి చప్పుడు చేసింది. దగ్గరగావున్న పాట్లపాదు గబ్బువాసన కొడుతోంది. అంత దాకా పడుకున్న గేదెగొడ్డు లేచి బెదురు నటించింది. దూరంలో గోల ఏదో పెచ్చుపెరుగుతోన్నట్టు చెవులు అనుమానించాయి.

"నా ఇష్టప్రకారం కాంతాన్ని తీసుకురాకమానను. ఆమెను నీవు సరిగా గౌరవించవా... ఎముకలు విరుగుతాయి" ఆ మాటలు నన్ను నిలవైచాయి. శ్రవణేంద్రియాలు జాగ్రత్తపడ్డాయి. కాళ్లు నిలద్రొక్కుకున్నాయి. గుండె కొంచెం కంగారే పడుతోంది. ఆ కంఠధ్వని రాజాదే. తీవ్రత్వం ప్రస్ఫుటిస్తోంది.

"ఏం? రేపు బండిలో వస్తుంది. ఎంతటి యోగ్యురాలో తెలుసా? హృదయమిచ్చిన పిల్ల. ఏకులపు దైతేం? ఇకనీవేమన్నా ఒక్క నెలరోజులామె మనయింట్లో మకాంతప్పదు."

రాజా బైటికివస్తున్న చప్పుడయి నాకాళ్ళు పరువెత్తాయి. ఎంత వేగంగా తోవలో ఒకరిద్దరినిటూకి నా గదిలోపడ్డా.

నా భావన యథార్థమయింది. సీత ఉత్తమ పతివ్రత. సుశీల. ఆమెను ఆ మూర్ఖుడు నాశనం చేస్తున్నాడు. ఒక నీచురాలిని, ఉంపుడుకత్తెని, ఇంట్లో ఇల్లాలివద్ద పెడతాడా? ఇల్లాలు గౌరవించి ఒక నెలరోజులు సేవచెయ్యాలట. దారుణంకదూ! అట్టిది ప్రత్యక్ష్యంగానే నాలో ఒక జ్యోతివెల్గింది. పురుషలోకంలో ఇటువంటి కృష్టులుంటారా? అన్న సందేహం తొలగిపోయిందిక. సీతకు తోడ్పడి రాజాకు బుద్ధిచెప్పే సాహసం నాలో ఉందేమో ఆలోచించాను. ఊహూం. ఆ రాజా రౌడీ. చెయ్యిచేసికొంటే అలాటివాళ్ళదగ్గర కత్తులుండవని ఎవరు చెప్పగలరు? ప్రమాదంగదూ!

ఒక యోగ్యురాలైన ఇందకత్తెకు ఘోరాన్యాయం జరిగిపోతోందని పేటపేటంతా చాటిచెప్పి తగిన బందోబస్తుచేస్తే, రాజాకు చెప్పుదెబ్బగా ఉండగలదు కాని నా మాటకు మన్నన యిచ్చే ప్రాణి పరిసరాల్లో పదిమైళ్ళలోకూడాలేదు. ఏక విషయాన్ని చెప్పడానికుపక్రమించినా "ఏడిశావులేవోయ్! రాజా సరిగా కళ్ళైనాతెరవలేదు. పెద్దసంగతులు విచారిస్తున్నావు. ఇలాటి సంస్కరణలమొదలుపెట్టావేమిటి?"అనడం పెద్దల కలవాటు. "పోరా! తెలివి. నీవోకోతలగాడివి" అంటూ చిన్నవాళ్లు చీదరిస్తారు. సంఘంలో నా మాటకంత విలువ ఎందుకుపోయిందో అర్థంగాని సగంతి. బహుశా ప్రతి చిన్నవిషయాన్ని లోపలికి చూచి సూక్ష్మపరిశీలనచేస్తానని యీర్ష్యయేమో.

అయినా ప్రయత్నించా. మా యింటిప్రక్కనున్న మాస్టరుగారితో సన్నగా జరిగింది వివరించాను. ఆ అభాగ్యురాలిని కాపాడవలసిన పూచీ మనబోటి విద్యావంతులమీద ఉందనిబోధించా.

ఎంతటి త్యాగానికైనా మనం ఒడికట్టాలని రోషించా. పెద్దపెద్ద పదాలతో ఉపన్యాసం రొప్పించా. ఆయన తాపీగావిని, ఏమీపట్టనట్టు "ఏమోనోయ్! నీవు చెప్పిందంతా కట్టుకథగా ఉంది. అలాటిసంఘటన మనవాళ్ళలో జరగడం అసంభవం. అదీగాక జరిగితే మనమేం చేస్తాం. చెడిపోయే ప్రతి ఆకతాయిని మనం మరమ్మత్తు చేస్తూఉంటామా? బాధలనందే ప్రతి స్త్రీని నీవూ నేనూ కాపాడతామా? చీకటి వెలుగుల కలయికే సృష్టి అనుకో. ఈ ద్వంద్వ ప్రపంచం, ద్వంద్వ సంఘర్షణలకు తట్టుకోగల అలవాటును పొందేవుంది. ఇలాటివన్నీ మననెత్తిమీదకెందుకు తెచ్చుకోడం" అన్నారు.

కేవలం పిల్లలకు బోధించిబోధించి విసివి వేదాంతి అయిన ఆయిన ఉపన్యాసానికి నా కరికాలు మంట నెత్తికొచ్చింది. ఎందుకీ వ్యక్తిత్వం? జీవితాదర్శమిదేనా? సంఘంలోని విషయాలను గొంగళిపురుగును విదలించినట్లు విదలించే యిలాటి నీరసపురాయుళ్లున్నంతవరకు జాతికి మేలు కల్గుతుందని దీర్ఘదర్శినైన నా కెలా తోస్తుంది? ఏవో పెద్దపెద్ద తుఫాను భావాలు విసిరాయి. ఇంకా ఒకరిద్దరదగ్గర ఈ ప్రసక్తి తెచ్చాను. అప్పుడే ఆ ఉంపుడుకత్తెను తెచ్చి యింట్లోకి నాల్గురోజులయిందని, దానికి తన భార్యచేత అడ్డమైన చాకిరీ చేయిస్తున్నాడని నాకు వార్తలు వచ్చినట్లు వివరించాను. "వాడు ఏట్లో దిగుతాడు నీ కెందుకురా?" వారు నన్ను చీవాట్లు పెట్టారు. గాయమైన మనస్సుతో కళ్లు మూసి పడుకున్నా. సన్నని కునుకుపట్టింది సంజ వేళ. కలతనిద్రలో మా యింటిప్రక్క ముసలమ్మ ఎవరితోనో రహస్యం (అదే రెండుఫర్లాంగులు వినబడుతుంది లెండి) చెబుతోంది. పాపం సీత ఆ తొత్తుకు అడ్డమైన చాకిరీ...

నే నికలేచి ఇప్పుడైనా సీతదగ్గరకు వెళ్ళి విషయం తేల్చుకొని తగిన ధైర్యం చెప్పాలి. ఇలాటి సంఘ దురాచారాన్ని రూపుమాపాలి. ఆవేశంతో ఆ సంజ చీకటిలోనే నూతివైపుకు వెళ్ళా సీత అదృష్టవశాత్తూ నూతిదగ్గరే ఉంది. దగ్గరగావెళ్ళి ఒంటరిగా చిక్కిన ఆమెకు నామనసులోని మాటలు తెలియజేయాలనిప్రయత్నించా. మగవాడికీ బలహీనత ఎక్కడనుండి వస్తుందో ఎంతటి ధైర్యవంతుడయినా పరిచయములేని స్త్రీని పలకరించడానికి చిత్తయిపోతాడు. గొంతు పట్టేస్తుంది, కాళ్లుచేతులు వణుకుతాయి. చెమటక్రమ్ముతుంది. ఏదో అనబోతున్నా. రాజాఆకస్మికంగా వచ్చాడు. నన్ను ఎగాదిగా చూచాడు. నేను వానితో వాదించి శాఖోపశాఖల వ్యాఖ్యానం చేసి వాని నీచత్వాన్ని రూపుమాపేయ్యాలని హృదయంలో ప్రయత్నించా.

"ఏమే దగాబాజీ! వీడితో నీకు మాటలేంటి? నీ వింతటిదానవనుకోలేదు" రాజా ఆమె జుట్టు పట్టుకుని బరబరాలాక్కెళ్ళాడు.

అరరే... ఆమెనాతో మాట్లాడిందని మాకేదో దుష్టమైన స్నేహం పూర్వంనుంచీ ఉందనీ రాజా అనుమానించాడా? హేయంగమా? వెనకాల తొందరగా పరువెత్తాను. వీధి తలుపుమూసి ఉంది. దబాదబా దెబ్బలు వినపడుతున్నాయి. నాకు కాళ్ల క్రింద నేల తొలగిపోయినట్లయింది. తల తిరిగి అక్కడే కూలబడ్డాను, ముందుకు వెళ్ళలేకపోయేను.

ఆ మరునాడు సీత యింటివైపు వెళ్ళాలంటే అపరాధమనిపించింది. ఇక ఆమార్గం త్రొక్కడమే మానేశాను. కడుపులో దేవుతోన్నట్టే ఉండేది. ఆ దృశ్యం జ్ఞాపకంవస్తే రాత్రులు నిద్రపట్టేదికాదు.

రెండవ ఆట సినీమా అయినట్టుంది. జనం గొడవగా వీధిలో వెళుతున్నారు. కొంచెంసేపు మరల నిశ్శబ్దం. తెరచిన కన్నులను మూద్దామనుకుంటున్నాను. రాజా గొంతు వినబడింది. గగ్గోలుగా... సినీమాకు వెళ్ళివచ్చాడట. ఎన్ని అరచినా సీత తలుపు తీయడంలేదట. ఇంట్లో మండుతున్న వెలుగులు కనబడుతున్నాయట. నాకాలోచనపోలేదు. జనం హడావిడిగా పరువులెత్తడము వినబడి నేనూ పరువెత్తాను. ఏంలాభం? సీత పూర్తిగా నూనిమంటల్లో తగలడిపోయిందని ప్రజలు పెదవులు విరిచారు. రాజానే ఈఘోర కృత్యానికి కారకుడు. లేకపోతే పెరటి తలుపు తీసి ఉంటుందా అని అన్ని అంతరాత్మలూ విమర్శించాయి. ఆత్మహత్య అని పంచాయితీ తీర్పు.

మొన్న పంచమికే రాజా రామానుజయ్య కూతుర్ని ద్వితీయ పత్నిగా స్వీకరించాడు. పెళ్లి ఒక విలాసమైపోయిందిసంఘంలోఅనుకున్నాను.